- కథ -

# భాగం

పి. సత్యవతి



పనులన్నీ యాంత్రికంగా, యథావిధిగా, సమయానికి తగ్గట్టుగా, కంప్యూటర్లో ప్రోగ్రామ్ చేసి పెట్టినట్టుగా జరిగిపోతున్నాయి చాలా కాలంగా. అంచేత ఆలోచించటానికీ సృజించటానికీ ఏమీ వుండదు శారదకి. ఉదయం ఆరుగంటలకి లేచిన దగ్గర్నుంచీ వరసగా మీటలు నొక్కుకోవటమే.

ఆ ఉదయపు ఆఖరిమీట, భర్తనీ కూతుర్నీ వారి వారి పనిప్రదేశాలకి పంపి, తలుపు వేసుకోవడం. మళ్ళీ భర్త భోజనానికి రావటం రెండు గంటలకి. అప్పటిదాకా పనేం వుండదు. కిటికీ ప్రక్క ఊగే కుర్చీ -

అట్లాగే ఆ కుర్చీలో కూర్చుని కిటికీలో నుంచి బయటకి చూసిన శారదని ఆశ్చర్యంలో ముంచి వేస్తూ, గేటు తీసుకుని లోపలికి వస్తున్నాడు అన్నయ్య. శారద కళ్లజోడు తీసి తుడిచిపెట్టుకుని చూసింది. సందేహం లేదు అన్నయ్యే. అప్పుడట్లా జరిగిన తరువాత అన్నయ్య రావడం ఆశ్చర్యమే. కానీ ఆనందం కూడా కదా! చెమరుస్తున్న కళ్ళని పమిటి కొంగుతో తుడుచుకుని తలుపు తీసి, ఎదురువెళ్ళి అతని చేతిలో సంచి అందుకుంది. మంచి నీళ్ళిచ్చి కుశల ప్రశ్నలు వేసింది. తాజాగా డికాక్షన్ తీసి క్రొత్త పాల ప్యాకెట్ కాచి, వేడి డికాక్షన్లో పొంగే పాలు వేసి, కాఫీని వెచ్చ బెట్టకుండా యిచ్చింది. అట్లా త్రాగడం ముందు నాన్నకీ, తరువాత అన్నయ్యకీ, ఆ తరువాత తనకీ అలవాటు. పక్కింటి నౌకర్ని బ్రతిమిలాడి రెండు బజార్ల అవతల వున్న స్టార్ హోటల్నుంచి బిరియానీ తెప్పించింది. గులాబ్జాం చేసింది. అన్నీ అడిగింది. అన్నయ్య కూడా అన్నీ అలాగే అడిగాడు.

కానీ, "నువ్వొచ్చిన పనేమిటన్నయ్యా? నిజంగా నన్ను చూడ్డానికొచ్చావా?" అని ఎంత ప్రయత్నించినా అడగలేక పోయింది.

"నువ్వు చిక్కిపోయావమ్మా" అన్నాడు. వదిన 'ఎక్కువ నువ్వులు వేసి నేతితో చేసిచ్చిన అరిసెలు' యిచ్చాడు. సంచిలో నుంచి తీస్తూంటేనే ఘుమ ఘుమ వాసన వచ్చింది. అరిసెలు చెయ్యడం వదినెకి అవలీల! రెండు గంటలకి శారద భర్త గోపాల్రావు వచ్చాడు. వాళ్ళిద్దరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. హాస్యాలాడుకుంటూ భోజనాలు చేశారు. తరువాత వచ్చి సోఫాల్లో కూర్చున్నారు. అన్నయ్యకి వక్కపొడి యిచ్చి ప్రక్కన కూర్చుంది శారద.

భోజనం చేసి మళ్ళీ ఆఫీస్కి బయల్దేరడానికి సన్నద్ధం అవుతున్నాడు గోపాల్రావు.

> స్త్రీవాద సాహిత్యానికి చిరునామాగా ఖ్యాతి నొందిన సత్యవతి కథలు కేవలం భారతీయ భాషలలోకే కాక, విదేశీ భాషలలోకి కూడా అను వాదం చెందడము విశేషం. మానవ జీవన విశ్లేషణ, ఆలోచనల ఆవిష్కరణలు సత్యవతి కథావస్తువులు. మన చుట్టూ ఉండే మధ్యతరగతి కుటుంబాలే ఈవిడ కథకు పాత్రలు.

అప్పుడన్నయ్య అన్నాడు. 'ఈ వూళ్ళో మీకింత పెద్ద ఇల్లుంది. రేపో మాపో మీ చిన్నమ్మాయికి కూడా పెళ్ళైపోతే, ఎప్పుడెవరి దగ్గరికి పోవాలంటే అక్కడికి పోతారు. ఈ భాగ్యానికి మీకు మనవూళ్ళో ఇల్లెందుకు బావగారూ? ఆ భాగం నాకు యివ్వండి. ధరకట్టి ఎంత అయితే అంత ఇచ్చేస్తాను. లక్ష అయినా ఫరవాలేదు.

గోపాల్రావు కాస్త ఆశ్చర్యపడుతూనే, "మీ వూరు కూడా ఇప్పుడు బాగా డెవలప్ అయింది కదా - లక్షేనా? ఇంకా ఎక్కువుంటుందేమో!" అన్నాడు.

"మీరూ నేనూ అనుకోవడం ఎందుకు? అక్కడున్న ధరలెంతో మీరే వాకబు చేసుకోండి ఎంతంటే అంతే! ఆ డబ్బు శారదపేర ఫిక్స్డ్ వేసు కుంటే నాన్న దానికి ఒక ఆదాయ వనరు యిచ్చి నట్టేగా - పైగా ఆ రెండు గదుల మీద వచ్చే అద్దె కంటే బ్యాంక్ వడ్డీయే ఎక్కువ వస్తుంది.

"సరేలెండి తొందరేం వుందీ - మీరు కాసేపు పడుకోండి - నేను ఆఫీసుకి వెళ్ళొస్తాను. వచ్చాక మాట్లాడదాం" అంటూ హడావుడిగా వెళ్ళి పోయాడతను.

శారదకి తెలుసు. గోపాల్రావు వ్యవహార దక్షుడు. దేనికీ తొందరపడడు. ఆలోచించుకోటానికి సమయం ఎట్లా తీసుకోవాలో తెలుసు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటారు, తనకి నాన్న యిచ్చిన రెండు గదుల భాగం గురించి, తను అక్కడే కూర్చుంది- తనతో సంబంధం లేకుండా వాళ్ళే మాట్లాడతారు. వాళ్ళే నిర్ణయిస్తారు. గోపాల్రావు వెళ్ళాక అన్నయ్య తనని కదిలిస్తాడేమోననుకుంది శారద. కానీ అతను సోఫాలోనే పడుకుని నిద్రపోయాడు.

శారద వుండేది నగరం. అన్నయ్య వుండేది, శారద పుట్టి పెరిగి వచ్చిందీ, పెద్ద పల్లెటూరిలా వుండే చిన్న పట్టణం. అక్కడే నాన్న ఉద్యోగం చేశాడు. ఉద్యోగం మానేసి చిన్న వ్యాపారం చేశాడు. వ్యాపారం కలిసొచ్చి ఇల్లు కట్టాడు. కట్టడమే ఇంటిని రెండు భాగాలుగా కట్టాడు. నాన్న వ్యాపారాన్ని అన్నయ్య అందిపుచ్చుకున్నాడు.

తమ్ముడికి చదువు వచ్చి ఉద్యోగం వచ్చి, తన భాగం అద్దెకిచ్చుకుని వెళ్ళిపోయాడు. శారద వుండే నగరానికీ, అన్నయ్య వుండే పట్టణానికీ బస్సులో వెడితే మూడు గంటలు. బస్సులు ఎప్పుడూ వుంటాయి.

శారద మళ్ళీ ఊగే కుర్చీలోకి చేరింది కళ్ళు మూసుకుంది.

\- - -

"నిన్నటిదాకా బాగానే ఉన్నాడు. ప్రొద్దున వున్నట్లుండి గురక మొదలైంది. మాటలేదు, సైగలే - వెంటనే బయలుదేరి రా!"

గత రెండు నెలలుగా ఎప్పుడు ఫోన్ మోగినా ఇలాంటి వార్త వినడానికి సిద్ధపడే వుంది శారద.

నాన్నది మరణించదగ్గ వయసే. ఆ మాటకొస్తే ఆ వయస్సు కూడా కాస్త దాటింది. రెండు నెలలుగా లేవడం లేదు. వారానికోసారి వెళ్ళొస్తూనే వుంది. బాగా మగ్గిపోయిన పండు, కుళ్ళకుండా రాలిపోవడం, ఆయనకీ, అందరికీ కూడా విముక్తేనని నిబ్బరంగా ఆలోచించగలిగిన వయస్సు శారదకి వచ్చి కూడా చాలా కాలం అయింది.

అందుకే నిబ్బరంగా ఫోన్ పెట్టేసి, స్టౌవ్ మీద సగం అయిన వంటని అంతనిబ్బరంగానూ పూర్తి చేసి, తన బట్టలు, మందులూ మర్చిపోకుండా సంచిలో సర్దుకుని, మొగుడికీ కూతురికీ ఫోన్లో చెప్పేసి, ప్రక్కింటావిడకి తాళం చెవులు యిస్తూ, "మా నాన్నకి ఎక్కువగా వుందిట - ఏమౌతుందో ఏమో.. వెడుతున్నా - కాస్త మావాళ్ళకి ఈ తాళం చెవులు యివ్వండి" అంది.

ఆవిడ తాళం చెవులు తీసుకుంటూ "అట్లాగా! పాపం ఏదో ఆయనుంటే వారం వారం వెళ్ళొస్తున్నారు. ఆయన పోతే ఇక మీకు ఆ వూరితో ఋణం తీరిపోయినట్టే" అంది.

## శుభాకాంక్షలు

'చినుకు' సాహిత్య మాసపత్రికను ప్రారంభిస్తున్నందుకు శుభాకాంక్షలు.

మీ పత్రిక విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. చినుకు పాఠకులకు ఉగాది శుభాకాంక్షలతో...



అబ్బూరి ఛాయాదేవి


ఆమాటకి గుండెలో ముల్లు గుచ్చినట్టయింది శారదకి. నాన్న పోతే ఇంక ఆ వూరు తను వెళ్ళదా! అన్నయ్య రమ్మనడా? ఎప్పుడన్నా వెడితే సంతోషించడా? నాన్న పోకముందే దుఃఖం వచ్చింది. ఆయన పోతాడంటే రాని దుఃఖం, ఆ వూరితో ఋణం తీరి పోతోందంటే ఎందుకు వచ్చింది? శారద వెళ్ళే వరకూ ఆయన పోలేదు. శారదని చూశాడు. దగ్గరకు వెడితే చెయ్యి పట్టుకున్నాడు. ఏదో సైగ చేశాడు. కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి ఆయనకి. తనే పమిట కొంగుతో తుడిచింది.

సాయంత్రానికి అంతా అయిపోయింది - అది హఠాన్మరణమూ, పిన్న వయస్సూకాదు గనుక, వెంటనే ఎవరి పనుల్లోకి, ఏర్పాట్లలోకి వాళ్ళు ప్రవేశించారు. అంత్యక్రియల వరకూ కాస్త గంభీరంగా వున్న వాతావరణం, ఆ పైన తేలికైంది. కబుర్లు కూడా మొదలయ్యాయి.

అమ్మ పోయి ఇరవై సంవత్సరాలయింది. ఆమె హఠాత్తుగా పోయింది. అప్పుడు మరణాన్ని యింత గంభీరంగా నిబ్బరంగా తీసుకోలేక పోయింది శారద. అనుకోని ఆ సంఘటన ఆమెని బాగా కలచి వేసింది. దుఃఖం వరద వెల్లువైంది. అంతేకాదు ఆమె చేత చేయించుకోవటమే గానీ, ఆమెకి తనేమీ చెయ్యలేదనే అపరాధ భావం గుండెలో సెలవేసింది. ఇప్పటికీ సలుపుతూనే వుంటుంది. తన ఆవేదన, తన అనుభవాలు అన్నీ అమ్మతో పంచుకునేది శారద. ఆమె అదంతా ఓపిగ్గా విని, "అన్నీ అవే సర్దు కుంటాయి శారదా! కాలం గడిచిన కొద్దీ - ఏమీ పట్టించుకోకు - నీ పని నువ్వు చేసుకుపో!" అనేది - అది ఎంతో ఊరటగా వుండేది శారదకి. అమ్మ పోయాక శారద దాదాపు మూగదే అయింది. ఎక్కడ పుట్టిన భావం, అక్కడే యిగిరి పోయేది - తనని తను ఒక యంత్రంలా మలుచుకుంది. నాన్నతో చనువూ సాన్నిహిత్యం వుండేవి కావు. కానీ ఈ మధ్య కాలంలో దాదాపు పదేళ్ళుగా ఆయన తనకి దగ్గరయ్యాడు. మంచం పట్టాక, ఒక వారం తను వెళ్ళక పోయినా వెంట వెంటనే ఫోన్ చేయించే వాడు. తన మంచం మీదే కూర్చోమనేవాడు. ఆయనే ఎక్కువ మాట్లాడేవాడు. శారద చిన్నప్పుడు ఎక్కువే మాట్లాడేది. తరువాత మితభాషి అయింది. ఆ తరువాత మౌనమే ఆమె భాష అయింది. అవసరం అయితే తప్ప నోరు విప్పటం మానేసింది. నాన్న మాట్లాడితే వినడం ఆమెకి బాగుంటోంది. తన కూతుళ్ళు మాట్లాడినా వినడం ఆమెకి బావుంటుంది. కానీ వాళ్ళకిప్పుడు తనతో మాట్లాడేందుకు 'సబ్జెక్టు' దొరకటం లేదంటున్నారు. గోపాల్రావు ఎప్పుడూ హడావుడిగానే వుంటాడు. ఎప్పుడైనా మాట్లాడతాడు. వినడం అలవాటైంది.

అమ్మ పోయే వరకూ అంతా కలిసే వుండే వాళ్ళం. తరువాత ఎవరి భాగం వాళ్ళు పంచేసుకున్నారు. తమ్ముడు తన భాగం అద్దెకిచ్చుకుని వెళ్ళిపోయాడు. వున్నట్లుండి నాన్న ఉత్తరంవైపు ఖాళీగా వున్న స్థలంలో రెండు గదులు వేశాడు. "అక్కడ ఎందుకు నాన్నా?" అని అన్నయ్య ఎంత చెప్పినా వినలేదు. అన్నయ్య భాగం ప్రక్కనున్న ఖాళీ స్థలంలో ఒక ప్రక్కగా వేశాడు. ఒక గదికి ఆనుకుని బాత్‌రూం కూడా కట్టించాడు. ఆ రెండు గదుల చుట్టూ దడి కట్టించి లోపల మొక్కలు వేశాడు. అదొక భాగంలా తయారైంది. తన మకాం అందులోకి మార్చుకున్నాడు. తన బీరువా, తన మంచం, తన సామాన్లన్నీ అందులోకి చేర్చుకున్నాడు.

"నిన్ను మేం సరిగ్గా చూడ్డం లేదని ఇట్లా చేశావా?" అని అన్నయ్య అలిగాడు.

"మీరు నన్ను చూసేదేమిటిరా? నేను బాగానే వున్నాను. ఇంకా మన షాపుకి వస్తున్నాను. కాస్తో కూస్తో సంపాదిస్తున్నాను - నాకు ఇట్లా విడిగా వుండాలనిపించింది అంతే - అమ్మ లేకుండా అక్కడ వుండలేను" అన్నాడు. కాఫీలు భోజనాలు అన్నీ అక్కడికే పంపేది వదిన. మనవళ్ళూ మనవరాళ్ళూ తాతయ్య గదుల్లోనే పడుకునే వాళ్ళు.

ఇదుగో ! మూడు నెలలనాడే అన్నయ్య నాన్నని తన భాగంలోకి మార్చాడు. ఆ గదులకి తాళం వేశారు.

ఆ చిన్న ఇల్లంటే శారదకి చాలా యిష్టంగా వుండేది. తను వెళ్ళినప్పుడల్లా దాన్ని శుభ్రంగా దులిపి సర్ది వచ్చేది. దడి ప్రక్కన మందార చెట్టు, మల్లె చెట్టూ కూడా వేసింది. కర్మకాండలకి బజ్జెట్లు వేశారు కొడుకులు. చెరిసగం అన్నారు. అంతా బాగానే జరిగింది. ఊరంతా భోజనాలు పెట్టారు. ఆ భోజనాల్లోకి నాన్నకిష్టమని తనే స్వయంగా దగ్గరుండి 'నువ్వులు ఎక్కువ వేసి నేతి అరిసెలు' వండించింది వదినె. తనకీ, తమ్ముడికీ కూడా యివ్వాలని కాస్త ఎక్కువగానే వండించింది. ఒక స్టీలు టిఫిన్ క్యారియర్‌లో సర్దించి, "ఇదుగో శారదా - ఇవ్వి నీకు - మళ్ళీ మిగులుతాయో లేదోనని ముందే తీసి పెట్టాను" అని చెప్పింది.

పెద్ద కర్మ కూడా అయిపోయింది. నాన్న ఫొటోకి లామినేషన్ చేయించి, గంధంపొట్టు దండ కొని వేశాడన్నయ్య. ఫొటోని ముందు గదిలో మేకుకి తగిలించాడు. భోజనాలకొచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు. వదిన తల్లి దండ్రులు, తమ్ముడి అత్త మామలు మాత్రం మిగిలారు.

సాయంత్రం నాలుగవుతుండగా, పెరట్లో ఆరేసిన తువ్వాలు మర్చిపోకుండా తెచ్చుకుని మడత పెట్టి సంచిలో పెట్టుకుంటూ "ఇక నేను బయలు దేరతాను వదినా!" అంది శారద.

"నువ్వు రేపు వెళ్ళొచ్చులే - వుండు - ఇదిగో మన మావయ్యనీ, రాంబ్రహ్మాన్ని కూడా రమ్మన్నాను - వాళ్ళ ఎదుట నాన్న బీరువా తీద్దాం" అన్నాడు అన్నయ్య.

"బీరువాతో నాకేం పని అన్నయ్యా" అంది శారద.

"కాదులే అమ్మా, వుండు - నే చెప్పాగా?" అంది వదిన.

రాంబ్రహ్మం నాన్న దగ్గర ఎప్పుడూ వచ్చి కూర్చుని కబుర్లు చెప్పేవాడు. నాన్నకి ఏదైనా పని చేసిపెట్టే వాడు. శారదకి ఫోన్ చేస్తూ వుండేవాడు.

"ముసలాయన ఎవరికివ్వాల్సింది వాళ్ళకప్పుడే యిచ్చాడు. ఇంకేముంటుంది. అందులో నా మొహం" అంది వదినె తల్లి "ఏమో ఏం వుందో - చూస్తే తెలుస్తుందిగా" అన్నాడు తమ్ముడి మావగారు.

రాంబ్రహ్మం వచ్చాడు. వచ్చిన రాంబ్రహ్మం చేతిలో ఏవో కాగితాలున్నాయి. అతను ఒక్కడే రాలేదు. ప్లీడరు గారిని వెంట తెచ్చాడు. ఆ ప్లీడరుగారు కూడా అందరికీ తెలిసిన వాడే. ఇప్పుడెందుకొచ్చాడో తెలీలేదు.

బీరువాలో నాన్న బట్టలున్నాయి. అమ్మవి రెండు చీరెలు న్నాయి. ఇరవై ఏళ్ళుగా ఆయన దాచుకున్నవి ఒక చిన్న సంచీ కూడా వుంది.

ఆ సంచిలోనే వుంది అసలు విషయం.

'ఇదేమిటీ!' అన్నాడు అన్నయ్య. 'అవును - ఇదుగో దాని తాలూకు అసలు ఇది. మీ నాన్న ఈ భాగాన్ని శారద పేర వ్రాయించి నిరుడే రిజిస్టర్ చేయించాడు. తను పోయాక మాత్రమే ఈ

**"తరంగాలు" కథా సంపుటి ఆవిష్కరణ**

విశ్వసాహితీ, త్యాగరాయగానసభ, సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 18, 2005 న కళా సుబ్బారావు ప్రాంగణంలో శైలజామిత్ర రచించిన **తరంగాలు** కథా సంపుటి ఆవిష్కరణ జరిగినది. ప్రముఖ కథకులు డా॥ పోతుకూచి సాంబశివరావు, డా॥ వేదగిరి రాంబాబు, డా॥ ఎం. చెన్నప్ప మొదలగువారు ఈ కథా సంపుటిపై విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. కళాదీక్షితులు, డా॥ కె. రాజలలిత శుభాకాంక్షలు అందజేశారు.

కాగితాలు శారదకివ్వమని నాకు చెప్పాడు. అందుకు సాక్ష్యం ఈ ప్లీడరు గారే! అన్నాడు రాంబ్రహ్మం. అన్నయ్య కాగితాలు మళ్ళీ మళ్ళీ చదివాడు. తమ్ముడు కూడా చదివాడు – ప్లీడరు పెద్దగా చదివాడు.

"అప్పట్లోనే పెళ్ళికి యాభై వేలు కట్నం యిచ్చాడు, పాతిక సెవర్ల బంగారం పెట్టాడు. మళ్ళీ తల్లి నగల్లో భాగం పెట్టాడు. ఇప్పుడు ఇంట్లో భాగం కూడా రాసిచ్చాడన్న మాట – అదృష్టం' అంది వదినె తల్లి. నాన్న తనకి ఏం పెట్టాడో తనకన్నా ఆవిడకే బాగా గుర్తున్నందుకు సంతోష పడింది శారద.

వదినె, తమ్ముడూ, మరదలూ, ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయారు. వాతావరణం మళ్ళీ గంభీరంగా మారిపోయింది. అమ్మ చీరెలు రెండూ తీసి, "ఇవి కావాలంటే తీసుకెళ్ళు" అని తన వొళ్ళో పడేసాడు అన్నయ్య – అన్నయ్య గొంతు ఇందాకటిలా లేదు.

'బీరువా తెరిచుడు' కార్యక్రమం ముగియగానే శారదని పట్టించుకోకుండా ఎవరి మటుకు వాళ్ళు ఇద్దరిద్దరుగా చీలి వ్యాఖ్యానాలు, గుసగుసలు ప్రారంభించారు. అప్పటికే చీకటి పడింది. రాంబ్రహ్మం గారు తనకి దస్తావేజులు అప్పజెప్పేసి వెళ్ళిపోయారు.

ఆ దస్తావేజులు శారదకి సంతోషాన్ని, సంభ్రమాన్ని కలిగించలేదు. పైగా ప్రక్కింటావిడ మాటలు పదే పదే గుర్తొచ్చాయి. ఇంక నీకా వూరుతో ఋణం తీరినట్టే ! ఎందుకిలా చేశాడు నాన్న!

కొన్నాళ్ళుగా నాన్న బాధ పడుతున్నాడని శారదకి తెలును. తను చదువుకుంటానంటే చదివించక, గోపాల్రావుకిచ్చి పెళ్ళి చేసినందుకో, గోపాల్రావు తల్లి మొదట్లో తనని వేధించినందుకో, వాటన్నింటి కారణం తనేననో – ఎందుకో మరి! ఏదో సరిదిద్దుకోవాలనుకున్నాడని అర్థం అవుతోంది – కానీ ఆయన ఈ దిద్దుబాటు ఎవరికీ సంతోషం కలిగించ లేదు సరికదా తనని తన వాళ్ళకి మరింత దూరం జేసింది.

నిన్నటివరకూ కబుర్లతో నవ్వులతో పెళ్ళివారిల్లులా వున్న ఆ ఇల్లు ఆ రాత్రి నిజంగానే ఆ ఇంట్లోని వ్యక్తి మరణించినట్టు విషాదాన్ని పులుముకుంది. అప్పటివరకూ పదిమంది మధ్యలో వున్న శారద, ఆ రాత్రి మళ్ళీ తన వంటరి తనాన్ని అర్థం చేసుకుంది. ఆ ఇంట్లో తన బాల్యం, ఆ ఇంట్లో తన కౌమార్యం, ఆ ఇంట్లో తన యౌవనం, అక్కడ తన పరుగులు, నడకలు, తన పాటలు, తన పాఠాలు, రోజుకొక తీరుగా ఎదిగి, కొమ్మలకి మొగ్గలు వేసి పువ్వులు పూస్తున్న చెట్టుని వేళ్ళతో సహా పెకిలించి మరొక ఇంట్లో నాటితే, మళ్ళీ ఆ వేళ్ళు భూమిలో అనుకుని, ఆ సారాన్ని పీల్చుకుని, అక్కడ ఎండకీ నీడకీ అలవాటుపడి, తేరుకుని బ్రతకటానికి ఎంత కాలం పట్టింది ! కానీ ఈ ఇల్లు నాదికాదు. ఇక్కడ నాకెవరూ లేరు.

"బుద్ధుందా శారదా! నీకిప్పుడు యాభై ఏళ్ళు, నీకో మనవరాలు కూడా పుట్టింది. ఇంకా పుట్టిల్లు చిన్నతనం అంటావేమిటీ!" యాభై ఏళ్ళొస్తే పుట్టిన ఇల్లు నాదికాకుండా పోతుందా? ఊరు నాది కాకుండా పోతుందా? మట్టి నాది కాకుండా పోతుందా?

నాన్న పోయాక ఇప్పుడు శారదకి దుఃఖం తన్నుకొచ్చింది.

తను తెచ్చిన యాభై వేలతో ఆడబడుచుకి పెళ్ళి చేసేసి, "నువ్వేం తెచ్చావు? మీ నాన్నేం యిచ్చాడు?" అని అస్తమానూ సాధించిన అత్తగారు గుర్తొచ్చింది. తను అనుకోవడానికి ఒక భుజం కోసం

**శుభాకాంక్షలు**

'**చినుకు**' సాహిత్య మాసపత్రికకు కథా నిలయం స్వాగతం పలుకుతోంది. పార్థివ నామ సంవత్సర '**చినుకు**' తొలి సంచికకు, పాఠకులకు నా శుభాకాంక్షలు.

'చినుకు'కై ఎదురుచూస్తూ....



ఆశీస్సులతో...

**కాళీపట్నం రామారావు**

'కథానిలయం', శ్రీకాకుళం

పడిన తపన గుర్తొచ్చింది. అమ్మ గుర్తొచ్చింది. చనిపోయిన నాన్న పెట్టిన కన్నీళ్ళు గుర్తొచ్చాయి. మానిపోయిన గాయాలకు లేపనం పూసి, గాయాలని మళ్ళీ రేపి నట్టయింది నాన్న చేసిన పని !

"నాకొద్దన్నయ్యా ! ఈ కాగితాలు మీరు తీసేసు కోండి - చింపెయ్యండి - నాతో మాట్లాడండి - నన్ను ఈ ఇంటికి రానివ్వండి - ఋణం తీరిపో నివ్వకండి" అని చెప్పాలనిపించింది.

సుదీర్ఘ రాత్రి తెల్లవారింది. వదిన యిచ్చిన కాఫీ త్రాగి "నే బయలు దేరతానొదినా!" అంది శారద.

ఆవిడ తల వూపింది. అన్నయ్య కొడుకుని పిలిచి 'అత్తని బస్సెక్కించిరా!' అన్నాడు ముభావంగా.

తనకోసం వదినె తీసిపెట్టిన 'నువ్వులు ఎక్కువ వేసి నేతితో వండిన అరిసెల' టిఫిన్ క్యారియర్ యివ్వడం మర్చిపోయింది వదినె. 'తనుకూడా అడగడం మర్చిపోతే పోలా?' అనుకుంది.

మూడు నెలల మౌనం తరువాత అన్నయ్య ఇప్పుడిట్లా !


శిరీష ఆఫీస్ నించీ వచ్చినట్టుంది. వంట ఇంట్లో కాఫీ పెడుతున్న వాసనొచ్చింది. అంతలోనే కాఫీ కప్పుతో వచ్చి తల్లి చేతిలో పెట్టి "మావయ్య వచ్చి నట్టు వున్నారు !" అంది.

"ఊఁ"

"ఏం అలా వున్నావ్ ! మావయ్య బాగా మాట్లాడలేదా !

శారద లేచి అరిసెల ప్యాకెట్టు చూపించింది. గోపాల్రావు కూడా వచ్చాడు. శారద మళ్ళీ అందరికీ కాఫీలిచ్చింది. పడమటి ఆకాశం ఎర్రబడింది. శారద మొహంలో ఒక దిగులు మేఘం.

ఒకసారి గోపాల్రావుతల్లికీ శారదకీ తగాదా అయింది. చాలా స్వల్ప ప్రాముఖ్యంగల విషయం మీద. గోపాల్రావు ఎప్పుడూ తల్లి వైపే. అతను కనీసం "ఎందుకు? ఏమిటీ !" అని కూడా అడక్కుండా తల్లిని సమర్ధించాడు. శారదకి చాలా రోషం వచ్చింది. వసంతనీ శిరీషనీ తీసుకుని బస్సెక్కి వచ్చింది నాన్న అమ్మల దగ్గరకి. తనెప్పు డొచ్చినా నాన్న "ఏమ్మా ! బావున్నావా?" అనడుగు తాడే గానీ ఇంకేం అడగడు. అడక్కపోయినా అమ్మకి చెప్పుకోడం తనకి అలవాటు. అమ్మ ఎప్పట్లాగే అన్నీ అవ్వే సర్దుకుంటాయి. తలవంచుకుని నీ పని నువ్వు చేసుకుపో !" అంది. తను వచ్చిన్నాడు రాత్రే గోపాల్రావు మావగారికి ఫోన్ చేసి శారదని అర్జెం టుగా పంపించమనీ, అప్పుడు పంపకపోతే ఇంకెప్పు డూ పంపవద్దనీ చెప్పాడు. "ఇలా అంటాడేం అల్లుడు" అని కూడా తనని అడక్కుండా వెంటనే టాక్సీ పిలిచి, తమ్ముణ్ణి తోడిచ్చి, వదినె చేత తన సూట్ కేసు కూడా సర్దించి పంపేశాడు. నాన్నమీద కోపం వచ్చి ఏడాది పాటు తను మళ్ళీ అక్కడికి వెళ్ళలేదు. అమ్మ చెప్పినట్లు అన్నీ అవ్వే సర్దు కున్నాయి. అత్తగారికి తన కొడుకు తన పక్షమేనన్న నమ్మకంతో పాటు, శారద ప్రమాదకరమైన వ్యక్తి కాదనీ, ఆమె తల్లి దండ్రులు ప్రతిదీ పట్టించుకునే రకం కాదనీ అర్థం అయింది. దాంతోపాటు ఆమెకి వయస్సుకూడా మీద పడడంతో కాస్త శారదతో మంచిగా వుండవలసిన అవసరాన్నికూడా ఆవిడ గుర్తించింది. ఇదంతా జరిగేవేళకి శారద, రోషం, అభిమానం అనే మాటలు మర్చిపోయింది. అమ్మ చెప్పినట్టే తలవంచుకుని తన పని తను చేసుకు



పోవడం నేర్చుకుంది. అప్పుడు ఆ రోజు నాన్న టాక్సీ పిలిచి వెళ్ళి పొమ్మన్నప్పుడు తనకీ భూమి మీద జానెడు స్థలం కూడా లేదనీ, తనంతటతాను రెండు రోజులు ఎక్కడా వుండలేననీ అర్థం అయింది.

ఎన్నోసార్లు, ఎన్నో అవమానాలని ఎక్కడికీ వెళ్ళి ఊపిరి పీల్చుకోకుండానే గోపాల్రావు అస్తమానం అనే "నా ఇల్లు" లోనే వుండి పోయింది. ఇప్పుడు నాన్న తనకి, తన పేరుమీద సర్వహక్కులతో ఒక నివాసం యిచ్చాడు. ఎప్పుడైనా వెళ్ళి రెండు రోజులు గుండె నిండా ఊపిరి తీసుకోడానికి. మొన్నటి ఆవేశంలో 'కాగితాలు తిరిగిచ్చేద్దాం! అన్నయ్యా వదినా మాట్లాడితేనే చాలు' అనిపించింది. కానీ ఇప్పుడలా అనిపించడం లేదు.

లక్షరూపాయలిచ్చి అన్నయ్య తనకి ఆ వూరితో ఆ ఇంటితో ఋణం తీర్చేస్తానంటున్నాడు. ఇన్నాళ్ళూ తను నాన్న ఇంటికి వెళ్ళింది. నాన్న కోసం వెళ్ళింది. నాన్న ఇల్లు తను పుట్టిన ఇల్లు కానీ అన్న ఇల్లు వేరు.

అన్నయ్య మొహం కడుక్కుని వచ్చాడు.

"మరి నే వస్తా బావగారూ. తొందరగా శారదనీ శిరీషనీ కూడా తీసుకుని రండొకసారి. అన్ని విషయాలు వాకబు చేసుకుని రిజిస్ట్రేషన్ పెట్టుకుందాం" అన్నాడు.

"రిజిస్ట్రేషనేమిటీ!" అంది శిరీష.

గోపాల్రావు చెప్పాడు. శారద భాగాన్ని 'తను' అమ్మితే 'మావయ్య' కొంటాడట.

'అమ్మనడిగారా!'

'అమ్మ మాత్రం ఏమంటుంది? పోయి అక్కడుంటుందా! అద్దెకిచ్చుకుంటుందా! డబ్బొస్తే బ్యాంక్‌లో వేసుకోవచ్చు"

"ఏం అమ్మకి ఆ ఇంటికి వెళ్ళి అప్పుడప్పుడు వుండాలని అనిపించదా ! ఆమెదంటూ ఒక ఇల్లు లేకుండా చెయ్యడం ఎందుకు? చాలా తప్పు నాన్న. తాతయ్య ఆలోచించి మరీ యిచ్చాడు. ఆ ఇల్లు అమ్మని వుంచుకోనీ, కావాలంటే ప్రక్కన చిన్న మావయ్య భాగం కొనుక్కోమను. ఆయన కూడా అక్కడ వుండడం లేదుగా"

## 'లోలోకి..' కవితా సంపుటి ఆవిష్కరణ

ఈగ హనుమాన్ రచించిన "లోలోకి..." కవితాసంపుటి ఫిబ్రవరి 27, 2005 న పాల్వంచలో గల ఎపిజెన్‌కో అతిథిగృహం వేదిక వద్ద జరిగినది. డా॥ అద్దేపల్లి, సాధనాల, ఎమ్మెస్సార్ వంటి సాహితీ ప్రముఖులతో బాటు కె.టి.పి.యస్. అధికారులు కూడా పాల్గొని హనుమాన్ సాహితీ వ్యవసాయంపై ఆత్మీయభాషణం చేశారు.

"వాళ్ళిద్దరూ తాతయ్య కొడుకులు. ఆ కాంపౌండ్‌లో ఇతరులుండకూడదనేమో !"

"అమ్మ ఇతరులా?"

"ఏమో తరువాత ఆలోచిద్దాంలే" గోపాల్రావు విసుగ్గా వెళ్ళి పోయాడక్కడ్నుంచి.

తాము ముగ్గురూ కలసి పెరిగిన ఆ ఇంట్లో తమతో పాటు తమ చెల్లి వుండడంలో ఆనందం లేదా ఆ అన్నతమ్ములకి ! తమ సుఖ సంతోషాల్లో చెల్లి భాగం పంచుకోడం యిష్టం లేదా వాళ్ళకి !

అన్నయ్య వెళ్ళిపోయాడు. గోపాల్రావు అతన్ని బస్ స్టాండ్‌లో దించటానికి వెళ్ళాడు. శిరీష స్నానం చెయ్యటానికి వెళ్ళింది. సాయంత్రం మళ్ళీ పని మొదలైంది శారదకి. సాయంత్రపు మీటలు నొక్కటానికి.

తను పెరిగిన ఇంటి ముంగిట చిలకలు వాలిన జామిచెట్టు, నాన్న ఇంటి ముందు తను నాటిన మల్లె తీగె నిండా విచ్చిన పూలు, బాల్యంలో వేప చెట్టుకి ఊగిన ఉయ్యాల, పెరట్లో గోరింటాకు రుబ్బుకునే రోలు, డాబామీదకి అమ్మ చేరవేసిన వేసవి కాలపు రాత్రి భోజనాలు, అన్నీ వరస దృశ్యాలుగా కదులుతున్నాయి శారద కళ్ళముందు.

"చిన్నప్పుడు ఎక్కువగా మాట్లాడేదాన్నన్నావు కదా! ఇప్పుడు మళ్ళీ మాట్లాడమ్మా. అవసరం అయినప్పుడన్నా మాట్లాడు. అవసరం అయిన దాన్ని గురించైనా మాట్లాడు" అంటోంది శిరీష శారద వెనక నిలబడి. ❖